క్రీడా కేంద్రంగా గ్రీన్ బెల్ట్

- అక్కయ్యపాలెం హైవేపై ఆహ్లాదంగా తీర్చిదిద్దిన గ్రీన్‌బెల్ట్ ప్రాంతం
- హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్‌లో అందమైన పార్కులు
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా
- ఆకట్టుకుంటున్న ఫ్లవర్ గార్డెన్ మధ్య వాకింగ్ ట్రాక్
- యువత కోసం షటిల్, వాలీబాల్, క్రికెట్ కోర్టులు


గ్రీన్ బెల్ట్‌లో ఆకట్టుకుంటున్న చిల్డ్రన్ ప్లే ఏరియా


రెండవ బాక్సు క్రికెట్ కోర్టు


గ్రీన్ మ్యాట్‌తో సిద్ధమైన బాక్సు క్రికెట్ కోర్టు

సీతంపేట:

నియోజకవర్గంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం క్రీడా కేంద్రంగా, జాతీయ రహదారికి మణిహారంగా నిలుస్తోంది. ఒకప్పుడు పిచ్చి మొక్కలు, తుప్పలు, శిథిలమైన ఫెన్సింగ్, ఆక్రమణలతో మందు బాబుల అడ్డాలుగా ఉండే గ్రీన్ బెల్ట్‌లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు చొరవతో సరికొత్త అందాలతో ఆహ్లాదాన్ని, ఆరోగ్యానిచ్చే పార్కులుగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలో హైవేకి ఇరువైపులా మణిహారంగా ఉండే గ్రీన్‌బెల్ట్ ప్రాంతలో ఆక్రమణలు తొలగించి, రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫ్లవర్ గార్డెన్లు, సిట్ అవుట్స్, లైటింగ్ ఏర్పాటు చేశారు. గ్రీనరీ అభివృద్ధి చేసి సేదతీరే వారికి ఆహ్లాదాన్ని ఇచ్చేలా తీర్చిదిద్దారు. వీటికి అదనంగా యువత కోసం వారికి ఇష్టమైన ఆటలు ఆడేందుకు షటిల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, రెండు బాక్సు క్రికెట్ కోర్టులు నిర్మించారు. పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 44వ వార్డు పరిధిలో అక్కయ్యపాలెం హైవే కూడలి నుంచి పోర్టు ఆస్పత్రి కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి ల్యాండ్ మార్క్‌గా నిలుస్తోంది. నగరంలో మిగిలిన చోట్ల కూడా ఇదే తరహాలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలకు, ఆహ్లాదానికి ల్యాండ్‌మార్క్..

వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు నగరంలోకి ప్రవేశించడానికి హైవేపై ప్రధాన కూడలి అయిన అక్కయ్యపాలెం జంక్షన్‌లో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం బ్యూటిఫికేషన్‌తో ప్రత్యేకంగా ఆకట్టుకోవడంతో పాటు అభివృద్ధికి ల్యాండ్ మార్కుగా నిలుస్తోంది. హైవేపై అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ వెనుక చిల్డ్రన్ పార్కు, షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దాని పక్కన నందిపార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. వంగవీటి పార్కులో ఓపెన్‌జిమ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరై నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఇటీవల పూర్తి చేశారు. దీనిలో భాగంగా దాని పక్కన ఫ్లవర్ గార్డెన్, వాకింగ్ ట్రాక్, యోగా పాయింట్ అభివృద్ధి చేశారు. యువత ఆడుకోవడానికి వాల్ బాల్ కోర్టు నిర్మించారు. బాల్ బయటికి వెళ్లకుండా కోర్టు చుట్టూ ఎత్తైన బాక్సు నిర్మించారు. పోర్టు ఆస్పత్రి సౌత్ బస్టాప్ వెనుక బాక్సు క్రికెట్ నిర్మించారు. యువత క్రికెట్ ప్రాక్టీస్ చేసేందుకు ఫ్లోర్ మ్యాట్, బాల్ రోడ్డు పైకి వెళ్లకుండా కోర్టు చుట్టూ బాక్సు నిర్మించారు. ఎస్‌బీఐ బస్ షెల్టర్ వెనుక చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి చేశారు. దర్గా పక్కన పిల్లల కోసం ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దర్గా ఎదురుగా మరో చిల్డ్రన్ పార్కు, వాకింగ్ ట్రాక్ , ఆంధ్రజ్యోతి పక్కన మరో బాక్సు క్రికెట్ నిర్మించారు. దీంతో అన్ని వయసుల వారు ఉదయం, సాయంత్రం తగిన వ్యాయామం, వాకింగ్ చేసేందుకు, పిల్లలు ఆడుకోవడానికి, యువత తమకు ఇష్టమైన క్రీడలు ప్రాక్టీస్ చేయడానికి అన్ని సదుపాయాలు కల్పించారు. దీంతో 43, 44 వార్డులకు చెందిన యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు,


అక్కయ్యపాలెంలోని గ్రీన్ బెల్ట్‌లో ఫ్లవర్ గార్డెన్ మధ్యలో వాకింగ్ ట్రాక్


వాలీబాల్ ఆడేందుకు బాక్సు కోర్టు

ఆహ్లాదాన్నిచ్చే పార్కులుగా...



ఒకప్పుడు ఆక్రమణలతో, శిథిలమైన ఫెన్సింగ్, చెత్తా చెదారంతో గ్రీన్ బెల్ట్ ప్రాంతం అస్తవ్యస్తంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని భావించాను. అక్కయ్యపాలెం బస్టాప్ నుంచి పోర్టు ఆస్పత్రి కూడలి వరకు ఉన్న ప్రాంతాన్ని అందమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, చిల్డ్రన్ పార్కులు, షటిల్ కోర్టు, బాక్సు క్రికెట్, వాలీబాల్ కోర్టు ఇలా అన్ని వయస్సుల వారు కాసేపు సేదదీరేందుకు, వాకింగ్, వ్యాయామం, చేసేందుకు వీలుగా అభివృద్ధి చేశాం. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పెండిగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి, యువత ఆటలు ప్రాక్టీస్ చేసేందుకు వాలీబాల్, షటిల్, బాక్సు క్రికెట్ కోర్టులు నిర్మించాం.

– బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్, 44వ వార్డు

అన్ని వయసుల వారికి..



సాయంత్రం వేళల్లో కాసేపు సేద దీరడానికి అందమైన పార్కులు అభివృద్ధి చేశారు. వ్యాయామం కోసం ఓపెన్ జిమ్స్, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. పిల్లలు ఆడుకోవడానికి లేడర్స్, స్లైడర్స్ వంటి ఎన్నో ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. మహిళలు వాకింగ్ చేయడానికి పచ్చని పూల మొక్కల మధ్య వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. యోగా చేయడానికి వీలు కల్పించారు. యువత ఆడుకోవడానికి షటిల్, క్రికెట్, వాలీబాల్ కోసం బాక్సు కోర్టులు నిర్మించారు. వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు చొరవతో ఈ అభివృద్ధి జరిగింది, చాలా సంతోషంగా ఉంది.

– ఎం.డి.దస్తగిరి, అక్కయ్యపాలెం.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ పి. శివ నారాయణ తమ సిబ్బందితో విశాఖ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన కాసుల మణికంఠ, రామనాతి నాగభైరవ అక్రమంగా రవాణా సుమారు రూ. 44 వేల విలువ గల 8.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా లింగంపల్లికి తరలిస్తున్నట్లు విచారణలో తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను జీఆర్‌పీ సిబ్బందికి అప్పగించగా, నిందితులని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినటు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

పుస్తకాల నిర్వహణపై అవగాహన


లైబ్రరీలో పుస్తకాల జాబితాను పరిశీలిస్తున్న చిన్నారులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా మంగళవారం పుస్తకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులకు నచ్చిన కథను చెప్పించారు. అనంతరం లైబ్రరీలో పుస్తకాల వివరాలు, వాటి నిర్వహణపై లైబ్రేరియన్ పద్మజ చిన్నారులకు వివరించారు. లైబ్రరీ సైన్సు ప్రాధాన్యతను తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాల లేబుల్స్ జాబితా తయారు చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జి.ఎస్.ఎన్. మూర్తి పాల్గొని యోగాలో భాగంగా వాయుబంధనం ద్వారా గాలిని చూడగలిగే విధానాన్ని వివరించారు. పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంచిణీ చేశారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

సీతంపేట: నాయీ బ్రాహ్మణ యువజన సేవా సంఘం అక్కయ్యపాలెం జోన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా పాకలపాటి వెంకట సత్య, ప్రధాన కార్యదర్శిగా కుదిరెళ్ల శంకర్, కోశాధికారిగా ఉత్తరవిల్లి అప్పలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షుడిగా పసుపులేటి గోవింద్, ఆర్గనైజర్ సెక్రటరీగా కొవ్వాడ సూర్య నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోడ పులుసు గణేష్, సహాయ కార్యదర్శిగా రాజాన సంతోష్, ప్రచార కార్యదర్శిగా గూడెపువలస త్రినాథ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం జోనల్ గౌరవాధ్యక్షుడు వేపాడ ప్రతాప్, నగర అధ్యక్షుడు ఆతవ సుబ్బారావు, రాజా రమణ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు గులిమి చరణ్‌కుమార్‌తో పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పర్యావరణ దినోత్సవ పోటీలు

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ బాలబాలికల కోసం ప్రత్యేక పోటీలను నిర్వహించనుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు కె. మాధవి, కార్యదర్శి పి. కమల తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయి. 5 నుంచి 12 సంవత్సరాల వయసు గల పిల్లలు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై పిల్లలు తమ అభిప్రాయాలను పంచుకునేందుకు ఇది చక్కటి వేదిక అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బాలబాలికలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ పోటీల ద్వారా పిల్లలలో పర్యావరణ స్పృహను పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యమని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

పలు కోర్సులలో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్‌లు యువతకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ శిక్షణను అందిస్తున్నాయి. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు కంచరపాలెం నందు గల ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు పి. నరసింహారావు (79015 23209), ఎం. నాగ త్రినాథ్ (98855 07887) నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆకట్టుకుంటున్న మే పుష్పం


విరబూసిన మే పుష్పం

మురళీనగర్: ఏడాదికోసారి మాత్రమే వికసించే మే పుష్పం చూపరులను ఆకట్టుకుంటోంది. మురళీనగర్‌లోని కె.పద్మావతి దేవి ఇంట్లో పెంచిన ఈ మొక్కకు మే పుష్పం పూసింది. పరిసర ప్రాంతాల ప్రజలు దీన్ని తిలకిస్తూ మురిసిపోతున్నారు. ఇది ఏడాదికోసారి మాత్రమే పూస్తుందని పద్మావతి చెప్పారు. పెరటి తోటలో పెంచుతున్న అనేక పుష్పాలలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని ఆమె తెలిపారు.

ఘనంగా ఉమారామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త తైనాల విజయ్‌కుమార్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల శ్రీ ఉమా రామలింగేశ్వరాలయం 12వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు తైనాల విజయ్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. వీరి చేతుల మీదుగా శివ పార్వతుల కల్యాణాన్ని ఆలయ అర్చకులు శర్మ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడిర మణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్, జోన్-1 ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం ఈ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. నరసింహనగర్, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, విద్యుత్ నగర్, పోర్ట్ స్టేడియం ఈస్ట్ గేటు, బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లు శంకరరావు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కర్రి రామారెడ్డి తదితరులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ నాయకులు

మద్దిపాలెం: కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై 'వెన్నుపోటు దినం' పేరుతో ఈనెల 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం పోస్టర్‌ను 49వ వార్డు కార్యాలయంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేనిపోని హామీలిచ్చి వాటిని గాలికొదిలేశారని మండిపడ్డారు. అర్హులైన కుటుంబాల ఆర్థిక పరోగతి పూర్తిగా దెబ్బతిందని, అభివృద్ధి కూడా శూన్యమని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన అరాచకాలు, మోసాలు, అన్యాయాలపై చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ అయినింటి రవికుమార్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హామీలు గాలికొదిలేశారు..

మద్దిపాలెం: కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై ఈనెల 4న 'వెన్నుపోటు దినం' పేరుతో వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం పోస్టర్‌ను విశాఖ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు వెన్ను పోటు పొడిచిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం..

తాటిచెట్లపాలెం: 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు జీవీఎంసీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1995లో ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని ఎలా బలవంతంగా స్వాధీనం చేసుకున్నారో, అదే విధంగా 2024లో సైతం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసి వెన్నుపోటు పొడిచారని తెలిపారు. వెన్నుపోటు దినం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. బుధవారం 4వ తేదీ ఉదయం కె.కె. రాజు ఆదేశాలతో నక్కవానిపాలెంలో గల కార్పొరేటర్ నివాసం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. పార్టీ శ్రేణులందరూ బుధవారం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేసవానిపాలెం, నక్కవానిపాలెం, గాంధీనగర్, క్రాంతినగర్, పెద్దలు, సీనియర్ నాయకులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అన్నమయ్య పద నర్తనం'


నృత్యం చేస్తున్న చిన్నారులు


ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: అన్నమయ్య 617వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'అన్నమయ్య పద నర్తనం' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ నృత్య ప్రదర్శనలో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఉక్కునగరం ప్రాంతాలకు చెందిన పలు డ్యాన్స్ స్కూల్స్‌లో శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు పాల్గొన్నారు. అన్నమయ్య కీర్తనలకు లయబద్ధంగా, చక్కటి అభినయంతో చేసిన నృత్య ప్రదర్శన సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య భంగిమలతో ఫొటోలు, సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలతో సందడి చేశారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

సీతంపేట: ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమిని, ఇళ్ల నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా 'సూపర్ సిక్స్' పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేసి ప్రజలను మోసగించిందని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేస్తారని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ప్రజల ఆశలను అడియాసలు చేసే ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. హామీలు అమలు చేయని పక్షంలో రాష్ట్రంలో పేదలందరితో కలిసి సీపీఐ మరిన్ని సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్, ఎస్. మధు రెడ్డి, వాసుపల్లి మల్లయ్య, ఆడారి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ ప్రాజెక్టుల టెండర్లు దళితులకే కేటాయించాలి


పోస్టర్ విడుదల చేస్తున్న విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు తదితరులు

సీతంపేట: రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టే ప్రాజెక్టులు, టెండర్లు దళితులకే కేటాయించాలని విస్తృత దళిత సంఘాల(విదసం) ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మంచి నీటి సరఫరా, విద్యుత్ ప్రాజెక్టులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమయ్యే సరకుల సరఫరా టెండర్లు దళితులకే కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో దళితుల కోసం నిర్మించే ఇళ్లు, రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఇలా ఎన్నో పనులు జరుగుతున్నా ఒక్క టెండర్ అయినా దళితులకు కేటాయించారా అని ప్రశ్నించారు. 2025–26 బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.20,281కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిలో స్కూల్ ఫీజులు, అమ్మ ఒడి, సామాజిక పెన్షన్ వంటి డీబీటీ పద్దుకు రూ.9 వేల కోట్లు కేటాయించి, మిగిలిన రూ.11 వేల కోట్లలో వివిధ శాఖల ద్వారా ఎస్సీల కోసం చేపట్టే ప్రాజెక్టులు వ్యవసాయ శాఖకు రూ.1,289 కోట్లు, గ్రామీణ దళితుల అభివృద్ధికి రూ.1,144 కోట్లు, ఎస్సీల ఇళ్ల నిర్మాణానికి రూ.1,257 కోట్లు, రేషన్ పంపిణీకి రూ.1,118 కోట్లు, దళితుల ఆరోగ్యానికి రూ.1,500 కోట్లు, మంచి నీటికి రూ.562 కోట్లు, దళిత వాడల్లో అంగన్‌వాడీలకు రూ.372 కోట్లు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమైన సరకులు, ఆహార సరఫరాకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు.

ఇవన్నీ సబ్‌ప్లాన్ నిధులే అయినప్పటికీ వాటిని ఖర్చు చేసే ప్రాజెక్టులు ఏవీ దళితుల చేతుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మా నిధులతో మా ఇళ్ల ముందు వేసే రోడ్లు, వాటర్ ట్యాంకులు, రోడ్లు, కాలువలూ, పైపులు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల నిర్మాణ పనుల టెండర్లు దళితులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాజి ఓంకార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 750 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 50 రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న లక్షా నాలుగు వేల మంది విద్యార్థుల భోజన తయారీకి వినియోగించే పప్పులు, నూనెలు, కూరగాయలు, గ్రుడ్లు, మాంసం సరఫరా నిమిత్తం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఏటా చెల్లిస్తోందని, ఈ కాంట్రాక్టులు దళిత నిరుద్యోగ యువతకు కేటాయించాలన్నారు. దళితవాడల్లోని 12 వేల అంగనవాడీ కేంద్రాలకు గ్రుడ్లు, పప్పులు, నూనె, చెక్కీల సరఫరాకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నారని, వీటి సరఫరా కాంట్రాక్టు దళితులకు ఇచ్చి జీవనోపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో సోడదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, కె.చిన్నారావు, డి.నిర్మల, రవిశేఖర్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు



చోరీకి పాల్పడిన నిందితులు

సీతంపేట: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 1వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న గుజ్జి వెంకట రమణ బజారు నుంచి తమ కాలనీకి చేరుకుంటుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏసీపీ క్రైమ్స్ డి. లక్ష్మణరావు పర్యవేక్షణలో ఫోర్త్‌టౌన్ ఇన్‌చార్జ్ క్రైమ్ ఎస్‌ఐ సల్మాన్ బేగ్ కేసు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, అనుమానితులను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా మద్దిపాలెం గ్రీన్‌గార్డెన్ ప్రాంతానికి చెందిన దాడి జోషన్‌కుమార్, ఉషోదయ జంక్షన్ ప్రాంతానికి చెందిన రాయిపల్లి షణ్ముఖరావు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. వారిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన మూడు తులాల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.